క్లుప్తంగా

సీతమ్మధారలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు



పాదచారులకు మజ్జిగ అందిస్తున్న శివసాగర్‌రావు

సీతమ్మధార: సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వద్ద ఆక్సిజన్ టవర్స్ వారియర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేశారు. దీనిని ముఖ్య అతిథి విశాఖ స్టీల్‌ప్లాంట్ పూర్వ చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్ శివసాగర్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ఎండలు అధికంగా ఉన్న నేపథ్యంలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసిన క్లబ్ కార్యవర్గాన్ని అభినందించారు. పాదచారులు, వాహన చోదకులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆక్సిజన్ టవర్స్ వారియర్స్ క్లబ్ ప్రతినిధులు సతీష్‌వర్మ, బి.అప్పారావు, పి.దేవరాజురెడ్డి, గిరీష్‌వర్మ, వై.రాంబాబు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి హారతులిస్తున్న భక్తులు

కంచరపాలెం: జ్ఞానాపురం పరిధి కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం చైత్ర మాస శుద్ధ సప్తమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. దేవదాయ శాఖ ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో ఆలయ అర్చకులు పులఖండ శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులకు ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ.50ల ప్రత్యేక దర్శన కౌంటర్లు ఏర్పాటు చేశారు. భక్తుల మౌలిక వసతులపై ఈవో ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు భక్తులకు అవసరమైన సౌకర్యాలను పర్యవేక్షించారు.

వృద్ధుడి అదృశ్యం



వేలూరి శ్రీనివాసరావు

మద్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వృద్ధుడు కనిపించడం లేదని కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఎస్.రామకృష్ణ ప్రసాదరావు అనే వ్యక్తి మామ వేలూరి శ్రీనివాసరావు ఫిబ్రవరి 14న కంచరపాలెంలో నివసిస్తున్న ఫ్యామిలీ ఫ్రెండ్ గోవిందు ఇంటికి వెళ్లాడు. అప్పటి నుంచి వారి ఇంటి సెల్లార్‌లో ఉంటున్నాడు. మార్చి 25న ఎన్ఏడీ జంక్షన్ దగ్గరలోని వల్లీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి గుడికి భోజనానికి వెళ్తున్నట్లు తెలిపి, బయలుదేరాడు. అప్పటి నుంచి ఆయన ఇంటికి రాలేదు. చాలా చోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేసారు. శ్రీనివాసరావు ఎత్తు సుమారు 6 అడుగులు, రంగు – తెలుపు. ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీసులకు గానీ 83746 13971 నంబర్‌లో గానీ తెలియజేయాలని కోరారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరం

మద్దిలపాలెం: వైజాగ్ చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియం ఎదురుగా గల ఫంక్షన్ హాల్‌లో వేసవి శిక్షణ శిబిరం నిర్వహించారు. కంచరపాలెం బి.ఎస్.ఆర్.ఫౌండేషన్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర సైన్స్ అండ్ టెక్నాలజీ నాయకుడు శివ నాగేశ్వరరావు పాల్గొన్నారు. రోజూ మనం ఉపయోగించే వస్తువులు, మన చుట్టూ ఉన్న వాటితో సైన్స్ ప్రయోగాలు చేసి చూపించి, పిల్లలకు నేర్పించారు. దీని కోసం కిట్ తయారు చేసి అందరికీ అందించారు. వీసీసీ ఫౌండర్ కె.రమాప్రభ మాట్లాడుతూ ఈ వేసవిలో విద్యార్థులకు వినోదంతోపాటు విజ్ఞానం కూడా అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. యువతకు శిక్షణ ఇచ్చి వారి ద్వారా క్యాంపులు నిర్వహిస్తామన్నారు. నివాస ప్రాంతాల్లో పిల్లల మధ్య స్నేహం, మొబైల్ నుంచి కొంత దూరంగా ఉండటం ఈ శిబిరాల్లో నేర్పిస్తున్నామన్నారు. సమ్మర్ క్యాంప్ నిర్వహణకు 83098 12422 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. జోన్ కన్వీనర్లు సరోజిని, మణి, హరిత, దేవితోపాటు మొత్తం 10 జోన్ల నుంచి చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈతకు సై



రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు



డైవింగ్‌కు సిద్ధమైన చిన్నారులు

మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లోని స్విమ్మింగ్ పూల్

మురళీనగర్: నడకతోపాటు కనీస వ్యాయామాల ద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ సాధన చేస్తారు. క్రీడలు ఇందుకు దోహద పడతాయి. వీటిలో స్విమ్మింగ్ ప్రాణ రక్షణకు సహకరిస్తుంది. ప్రమాదాలు జరిగి తటాకాల్లో పడిపోతే ఈత ద్వారా స్వయం రక్షణ సాధ్యమవుతుంది. దీంతో స్విమ్ చేయాలనే ఆసక్తి అందరిలో పెరుగుతోంది. పిల్లలు, పెద్దలతోపాటు మహిళలు ఈత అంటే ఇష్టపడుతున్నారు. ఈ నేపథ్యంలో వారికి అందుబాటులో ఉండే స్విమ్మింగ్ పూల్‌ను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుత వేసవి సెలవుల్లో ఈత నేర్చుకునేందుకు చాలా మంది ఆసక్తి చూపుతున్నారు. మురళీనగర్ వైశాఖి స్పోర్ట్స్ పార్క్‌లోని ఆధునిక స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ ఇవ్వనున్నారు. నామమాత్రపు రుసుముతో అందరికీ సమ్మర్ క్యాంప్ ఏర్పాటు చేశారు.

వేసవిలో స్విమ్మింగ్ నేర్చుకుందాం రండి

పిల్లలు, పెద్దలు, మహిళల్లో ఆసక్తి

మురళీనగర్‌లో సమ్మర్ క్యాంప్‌నకు అంతా సిద్ధం

వైశాఖి స్పోర్ట్స్ పార్క్ స్విమ్మింగ్ పూల్‌లో శిక్షణ

ఫీజుల వివరాలు

- లైఫ్ మెంబర్స్‌కు రూ.500, వీరికి డిప్‌కు రూ.75 తీసుకుంటారు.
- ఇతరులకు నెలకు రూ.1,500, డిప్ గంటకు రూ.200 తీసుకుంటారు. యూపీఐ ద్వారా ఫీజు చెల్లించాలి.
- కొత్తగా చేరే వారు ఆధార్ కార్డుతోపాటు రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు తీసుకు రావాల్సి ఉంటుంది.

బ్యాచ్‌లుగా శిక్షణ.. సమయం

ఈ సారి సమ్మర్ క్యాంప్‌లో ఏడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇస్తారు.

- ఉదయం 5 - 6, 6 - 7, 7 - 8 గంటల వరకుకు మూడు బ్యాచ్‌లు
- సాయంత్రం 4 - 5, 5 - 6, 6 - 7 గంటల వరకుకు మూడు బ్యాచ్‌లు
- మహిళలకు ప్రత్యేకంగా సాయంత్రం 7 నుంచి 8 గంటల వరకు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు.
- బ్యాచ్‌కు 50 మంది వరకు అనుమతిస్తారు. ప్రతి రోజూ ఈ కొలనులో 350 మంది వరకు స్విమ్మింగ్‌లో శిక్షణ ఇస్తారు.
- పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా కోచ్‌లను ఏర్పాటు చేశారు.
- పురుషులకు జి.రామారావు 8 ఏళ్లగా కోచింగ్ ఇస్తున్నారు.



సౌరా అథ్లెట్స్ స్విమ్మింగ్‌లో బంగారు పతకం సాధించిన టి.అనిల్

స్విమ్మింగ్ పూల్ నిర్వహణ

వైశాఖి స్పోర్ట్స్ పార్క్ ఈత కొలనులో పెద్దలతోపాటు చిన్నారులకు బేబీ పూల్ ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 25 మీటర్ల పొడవు, 10 మీటర్ల వెడల్పు గల ఆధునిక పూల్ ఉంది. పూల్ రన్నింగ్ సమయంలో రోజంతా నిరంతరం మోటార్ రన్ అవుతుంది. వేస్టేజీ వాటర్ డ్రైనేజీకి వెళ్లేలా ఏర్పాట్లు చేశారు. నీటిలో క్లోరిన్‌తోపాటు క్రిములు పోవడానికి ద్రావణం కలుపుతారు. రోజూ రెండు సార్లు క్లీనింగ్ చేస్తారు. నీటి స్వచ్ఛతకు ప్రాధాన్యమిస్తారు.

మురళీనగర్ విద్యార్థుల సత్తా

ఇక్కడ శిక్షణ పొందిన విద్యార్థులను వివిధ స్థాయిల్లో ఈత పోటీలకు సిద్ధం చేస్తున్నారు. వీరిలో చాలా మంది జాతీయ స్థాయిలో రాణించారు. ఇప్పటి వరకు 20 మంది జాతీయ స్థాయిలో పాల్గొని 5 బంగారు పతకాలు సాధించారు. ఇటీవల 18 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొన్నారు.

'ఈ'త నిబంధనలు పాటించాలి

స్విమ్మింగ్‌కు ముందు, తర్వాత షవర్ బాత్‌కు ఏర్పాట్లు చేశారు. తప్పనిసరిగా వీరు ఈ నిబంధన పాటించాలి. పురుషులు, మహిళలకు ప్రత్యేకంగా డ్రస్ చేంజింగ్, వాష్ రూమ్స్ ఏర్పాటు చేశారు. స్విమ్మింగ్‌కు వచ్చే వారు తమతోపాటు స్విమ్ సూట్, గాగుల్స్, క్యాప్ తెచ్చుకోవాల్సి ఉంటుంది.



ఈత పోటీల్లో పాల్గొన్న విద్యార్థులతో పార్క్ నిర్వాహకులు

లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్నాం



మురళీనగర్‌లో ప్రజలందరికీ ఉపయోగపడేలా స్విమ్మింగ్ పూల్‌ను లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్నాం. ప్రతి ఏడాది పోటీలు నిర్వహించి విద్యార్థులను ప్రోత్సహిస్తున్నాం. నగరంలోని అన్ని స్విమ్మింగ్ పూల్స్ కన్నా తక్కువ ఫీజుతో తీసుకుంటున్నాం. వేసవిలో ప్రత్యేక శిక్షణ శిబిరాలు ఏర్పాటు చేస్తున్నాం. అందుకే మా స్విమ్మింగ్ పూల్‌కు డిమాండ్ ఉంటుంది.

– సనపల వరప్రసాద్, అధ్యక్షుడు, వైశాఖి స్పోర్ట్స్ పార్క్

ఉద్యోగాల సాధనకు స్విమ్మింగ్



స్విమ్మింగ్ వల్ల ఆరోగ్యంతోపాటు ఈ క్రీడలో రాణించే విద్యార్థులు ఉన్నత విద్యాభ్యాసానికి రిజర్వేషన్ పొందుతారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు లభిస్తాయి. 8 ఏళ్లుగా వేలాది మందికి శిక్షణ ఇచ్చాం. చాలా మంది రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించారు. డెకథ్లాన్ సంస్థ కూడా స్విమ్మింగ్ పోటీలు నిర్వహిస్తుంది. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు ఇక్కడ నిర్వహిస్తున్నాం.

– జి.రామారావు, కోచ్, మురళీనగర్

ఘనంగా ఈస్టర్ వేడుకలు

- ఏసుక్రీస్తు పునరుద్ధాన జాగరణలు
- ఆర్చి బిషప్ బాలశౌరీరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు



ఏసుక్రీస్తు వేషధారణలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాదరావు

సీతంపేట: అక్కయ్యపాలెం పోర్ట్ స్టేడియం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్.ప్రసాదరావు ఏసుక్రీస్తు వేషధారణలో అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశుద్ధాత్ముడు ఏసుక్రీస్తు తిరిగి లేచిన రోజున ఈస్టర్ వేడుకలు జరుపుకుంటారన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విఠల్, సభ్యులు పాల్గొన్నారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు సాలగ్రామపురంలోని క్రైస్ట్ గాస్పల్ చర్చ్ ఆధ్వర్యంలో ఈస్టర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఆదివారం ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దైవసేవకులు ఏసు పునరుత్థాన దిన సందేశాన్ని వినిపించారు. మానవులను రక్షించేందుకు ఏసుక్రీస్తు లోకానికి వచ్చి, సిలువపై ప్రాణాలు విడిచి, మరణాన్ని తిరిగి జయించాడని తెలిపారు. అనంతరం ప్రేమవిందు ఏర్పాటు చేశారు.

లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్‌లో..

లైఫ్ చేంజింగ్ రివైవల్ సెంటర్ పి.జె.స్టీఫెన్‌పాల్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో పోర్టు స్టేడియంలోని విశ్వనాథ్ కన్వెన్షన్స్‌లో ఈస్టర్ ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్టీఫెన్ పాల్ మాట్లాడుతూ మానవాళి రక్షణ నిమిత్తం ఏసు తన రక్తం కార్చి సిలువలో శ్రమలు అనుభవించి, మరణించి తిరిగి లేచాడని తెలిపారు. జూన్ 8న ఇదే స్థలంలో 7 గంటల ప్రార్థనలు జరుగనున్నాయని, ప్రతి ఒక్కరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు.



క్రైస్ట్ గాస్పల్ చర్చి ఈస్టర్ వేడుకల్లో పాల్గొన్న సంఘ సభ్యులు

రక్షణగిరిలో జాగరణ, ఆరాధనలు

కంచరపాలెం: క్రైస్తవులు ఉత్సాహంగా నిర్వహించే పాస్కా(ఈస్టర్) ఉత్సవాన్ని జ్ఞానాపురం రక్షణగిరిలో సెయింట్ పీటర్స్ పునీత పేతురి ప్రధాన దేవాలయం విచారణ గురువులు ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్, పారిస్ పాస్టిల్ కౌన్సిల్ (పీపీసీ) అధ్యక్షుడు శ్రీముసురు రాజేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును స్తుతించే ప్రార్థనలనే పాస్కాగా పిలుస్తారని, గుడ్‌ఫ్రైడే మరుసటి రోజు శనివారం అర్ధరాత్రి 12 గంటల తర్వాత ఏసుక్రీస్తు సమాధి నుంచి బయటకు వస్తారని క్రైస్తవులు నమ్మకంగా విశాఖ అపోస్తలిక్ పాలనాధికారి, విశాఖ అతిమేత్రాశనం అగ్రపీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాలశౌరీరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ రక్షణగిరిలో పునీత పేతూరు రాయప్ప దేవాలయం విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో జాగరణ, దివ్యపూజా బలులు, ప్రార్థనలు నిర్వహించారు. మృత్యుంజయుడైన క్రీస్తును సెయింట్ పీటర్స్ ప్రధాన దేవాలయానికి తీసుకొచ్చారు. రక్షణగిరిని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దివ్యపూజా బలులు సమర్పించారు. గురువులు ఫాదర్ వినయ్‌కుమార్, ఫాదర్ అంథోనిరాజ్ ప్రత్యేక ప్రార్థనల్లో పరిశుద్ధ జలమును అభిషేకించారు. క్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచే ఘటనను చూపిస్తూ ప్రదర్శించిన భారీ సెట్టింగ్, చిన్నారులు ప్రదర్శించిన పలు కార్యక్రమాలు ఆహుతుల్ని ఆకట్టుకున్నాయి. పారిస్ పాస్టల్ కౌన్సిల్ (పీపీసీ) సభ్యులు పనులు పర్యవేక్షించారు. ఆలిండియా కేథలిక్ యూనియన్ జాతీయ కార్యదర్శి బీవీఆర్ శేషుబాబు, హేమాల విజయకుమార్, బేతా జోసెఫ్, శ్యామలరావు తదతరులు పాల్గొన్నారు.



క్రీస్తు సందేశం వినిపిస్తున్న అగ్ర పీఠాధిపతి రెవరెండ్ ఫాదర్ బాలశౌరీరెడ్డి



రక్షణగిరి ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

అన్నమాచార్య సంకీర్తనలతో శ్రీనివాసుని కటాక్షం



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అతిథులు

సీతంపేట: అన్నమాచార్య జయంతిని పురస్కరించుకుని శృతిలయ భక్తి సంగీత సేవా సంస్థ వ్యవస్థాపకుడు వి.ప్రభాకర్ ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అన్నమాచార్య సంకీర్తనా పోటీలు నిర్వహించారు. కప్పరాడ వైభవ వెంకటేశ్వరస్వామి ఆలయ అర్చకుడు జి.శేషాచార్యులు జ్యోతి వెలిగించి పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమాచార్య సంకీర్తనలు ఎవరైతే భక్తితో గానం చేస్తారో వారికి శ్రీనివాసుని కటాక్షం లభిస్తుందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు భక్తిని కూడా అలవర్చుకోవాలని సూచించారు. ఐదు విభాగాల్లో జరిగిన పోటీలో నగరానికి చెందిన 180 మంది విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ముఖ్య అతిథి వంకాయల సన్యాసిరాజు, సంస్థ గౌరవాధ్యక్షుడు కె.ఎ.రాజు, అధ్యక్షుడు వి.ప్రభాకర్, కార్యదర్శి ఎం.ఎస్.మాధవ్, కన్వీనర్ సి.హెచ్.వి.సత్యనారాయణ, ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్, కొణతాల రాజు, మేడా మస్తాన్‌రెడ్డి, వి.నాంచారయ్య, పీవీఎస్‌వీ ప్రసాద్, అరుణకాంత్ పాల్గొన్నారు.

హద్దు మీరితే కఠిన చర్యలు



ద్వారకా పీఎస్‌లో రౌడీషీటర్లకు సూచనలిస్తున్న ఎస్ఐ శ్రీను



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు

సీతమ్మధార: సమాజంలో అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రౌడీషీటర్లను ఫోర్త్‌టౌన్ ఎస్ఐ చిన్నంనాయుడు హెచ్చరించారు. ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆదివారం రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, వేలిముద్రలు, సంతకాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు కృషి చేస్తున్నామన్నారు. మద్యం షాపుల వద్ద చిందులేసినా, గొడవలు చేసినా ఊరుకునేది లేదన్నారు. మంచిగా ఉండాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్లపై ఎల్లప్పుడూ పోలీస్ నిఘా ఉంటుందని, సత్ప్రవర్తనలో మెలగాలని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంచిగా జీవించండి : ద్వారకా పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఎస్ఐ శ్రీను కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తగాదాలు, కొట్లాటల్లో తలదూర్చకుండా కుటుంబ సభ్యులతో కలిసి హాయిగా, మంచిగా జీవించాలని సూచించారు. హద్దు మీరి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీస్తు బోధనలు అనుసరణీయం

సీతమ్మధార: ఈస్టర్ పర్వదినం పురస్కరించుకుని దక్షిణ నియోజకవర్గంలోని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పి.వి.రమణమూర్తిని చర్చి సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. నగరంలోని భానునగర్ సియోన్ మందిరంలో జరిగిన కార్యక్రమంలో పాస్టర్ శివశంకర్ లాజరస్ ఆధ్వర్యంలో డాక్టర్‌ను శాలువ, పూలమాలలతో సత్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రమణమూర్తి మాట్లాడుతూ శిలువ వేయబడిన ఏసుక్రీస్తు మళ్లీ ఈ లోకంలోకి అడుగుపెట్టిన పర్వదినమే ఈస్టర్ అని గుర్తు చేశారు. క్రీస్తు బోధనలు మానవాళికి అనుసరణీయమని పేర్కొన్నారు. చర్చి సభ్యుల ఆధ్వర్యంలో క్రీస్తు గీతాలు ఆలపించారు. కార్యక్రమంలో చర్చి సంఘం సభ్యుడు వెంకటరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహంలో వివాహితకు ఆశ్రయం

సీతమ్మధార: అన్నవరానికి చెందిన వివాహిత లలిత ఇంటి నుంచి బయటకు వచ్చేసింది. దిక్కుతోచని స్థితిలో రైల్వే స్టేషన్‌లో ఉండగా రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) పోలీసులు గుర్తించారు. ఆమెకు సహాయం అందించేందుకు ఏయూటీడీ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఏయూటీడీ సిబ్బంది మహిళా షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయిని సంప్రదించగా.. ఆమె తక్షణమే రైల్వే స్టేషన్‌కు చేరుకుని లలితను తమ సంరక్షణలోకి తీసుకున్నారు. సీతమ్మధారలోని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని మహిళా వసతి గృహంలో లలితకు ఆశ్రయం కల్పించారు. అక్కడ ఆమెకు భోజనం, వసతి కల్పించారు.

బంధువులకు వ్యక్తి మృతదేహం అప్పగింత



పశ్చిమబెంగాల్ వాసి మృతదేహం(ఫైల్)

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీసులు నమోదు చేసిన కేసుకు సంబంధించిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని ఎట్టకేలకు గుర్తించారు. పోర్ట్ హాస్పిటల్ ఎదురుగా అబిద్‌నగర్ సమీపంలో ఈ నెల 13న గుర్తు తెలియని ఓ వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతూ మంగళవారం అతడు మృతిచెందిన విషయం తెలిసిందే. పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చిన మృతుడి బంధువులు ఆదివారం నాలుగో పట్టణ పోలీసులను సంప్రదించారు. పోలీసులు కేజీహెచ్ మార్చురీ వద్ద ఉన్న మృతదేహాన్ని వారికి అప్పగించారు. మృతుడు హైదరాబాద్ నుంచి కోల్‌కతాకు వెళ్తుండగా రైలులో దొంగలు జేబు కొట్టేయడంతో విశాఖలో దిగిపోయాడని బంధువులు తెలిపారు. ఫోర్త్‌టౌన్ సీఐ సత్యనారాయణ పర్యవేక్షణలో హెడ్ కానిస్టేబుల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో ట్రాఫిక్ పరేషాన్



నార్త్ ఎక్స్‌టెన్షన్ మెయిన్ రోడ్డు మీద పార్క్ చేసిన లారీ, వాహనాలు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు సీతమ్మధార దరి నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలు రెట్టింపవుతున్నాయి. ఇక్కడ ఒక ఆస్పత్రి నిర్మాణంలో ఉన్న కారణంగా రోజూ ట్రాఫిక్ పద్మవ్యూహం మాదిరిగా ఉంటోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడి మెయిన్ రోడ్డు మీదే పొక్లెయిన్ ఉన్న లారీతోపాటు ఇతర వాహనాలను పార్క్‌చేసి ఉంచడంతో పాదచారులు, వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఒకవైపు బాలయ్యశాస్త్రి లేఅవుట్ రోడ్డులో ట్రాఫిక్ సమస్యలుండగా.. ఎదురుగా ఉన్న నార్త్ ఎక్స్‌టెన్షన్ షాపింగ్ కాంప్లెక్స్ వద్ద వాహనాలను రాంగ్ పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ఇక్కడి దుకాణాల ఎదురుగానే ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలను ఇష్టానుసారంగా నిలుపుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ద్వారకా ట్రాఫిక్ పోలీసులు స్పందించి నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో రాంగ్ పార్కింగ్‌ను నిరోధించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

15 ఏళ్ల తర్వాత ఇంటికి చేరిన సిద్ధయ్య



సిద్ధయ్యను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఏయూటీడీ సిబ్బంది

సీతమ్మధార: సుమారు రెండేళ్ల క్రితం రైల్వే స్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో, అంగవైకల్యంతో నడవలేని స్థితిలో ఉన్న సిద్ధయ్య అనే మానసిక రోగిని ఏయూటీడీ సిబ్బంది రక్షించారు. అప్పటికే 13 ఏళ్లుగా ఒంటరిగా తిరుగుతూ వైజాగ్ చేరుకున్న అతనికి ఏయూటీడీ ఆశ్రయం కల్పించింది. కర్ణాటక రాష్ట్రం, తుమకూరు జిల్లాలోని బుక్కపట్నంకు చెందిన సిద్ధయ్య అక్కడ వ్యవసాయం చేస్తూ జీవనం గడిపేవాడు. అతని తల్లి కూడా మానసిక సమస్యలతో బాధపడేది. కొన్నాళ్లకు సిద్ధయ్యకు మానసిక వ్యాధి తీవ్రమైంది. దీంతో ఇల్లు వదిలి వెళ్లిపోయాడు. అలా విశాఖ చేరుకున్న సిద్ధయ్యను ఏయూటీడీ సిబ్బంది చేరదీసి, ప్రభుత్వ మానసిక వైద్యశాలలో మెరుగైన చికిత్స అందించారు. అనంతరం అతన్ని ఏయూటీడీ షెల్టర్‌కు తరలించారు. సిద్ధయ్య పూర్తిగా కోలుకున్నాడని నిర్ధారించుకున్న తర్వాత, ఏయూటీడీ సిబ్బంది సిద్ధయ్య వివరాలు తెలుసుకుని అతని స్వగ్రామానికి తీసుకెళ్లారు. బుక్కపట్నంలో ఆయన సోదరుడు రంగరాజుకు క్షేమంగా అప్పగించినట్టు సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు చెప్పారు.